# నిజాయితీ లేడని ఆడది

పిప్పళ్ళ
సూర్యప్రకాశరావు



ఓ మత్తు మూర్తి చిత్తుగా తాగుతున్నాడు. చిత్తు కాగితాల్లా ఖర్చు పెడుతున్నాడు పచ్చనోట్లు.

"రావ్! యు ఆర్ టూ మచ్ టు డే! బి ఇన్ యువర్ లిమిట్స్!" అని తూలిపడ్డాడో శ్రేయోభిలాషి.

అంత మత్తులోనూ మత్తుమూర్తికి నవ్వొచ్చింది. ఎక్కడో చదివిన జోకొకటి గుర్తుకొచ్చింది. బార్‌లో తాగుతున్న కొడుకుని చూసి తండ్రి అన్నాడట— 'తనయా! తాగుతున్నావు, బాగానే ఉంది. కాని, ఎదురుగా ఉన్న ఇద్దరూ నలుగురైతే తాగడం మానేయ్!' అని.

కొడుకు చూశాడు. ఎదురుగా ఒక్కడే కూర్చున్నాడు! మళ్ళీ నవ్వుకున్నాడు మత్తుమూర్తి. బలవంతంగా

కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా చక్కని చిన్నది. తన వంపుల సొంపులన్నీ దాచకుండా అందరికీ పంచుతూంది. "బతకడానికి బట్టలెందుకురా?" అని పాడుతూ కట్టుకున్న పలచని బట్టలన్నీ ఒక్కొక్కటే విప్పమని అందర్నీ ప్రాధేయపడుతూంది.

ఓ టేబుల్ దగ్గరి కొచ్చి జాకెట్ హుక్స్ విప్పమంది. సిగ్గుపడ్డా డతను. "ప్లీజ్! మా ఫ్రెండ్సంతా చూస్తున్నారు. డు ఇట్" అని ధైర్యము ప్రోత్సహించిం దా మోడరన్ భార్య.

మత్తుమూర్తి లేచి నిలబడ్డాడు, అతి కష్టంమీద. తూలి ఎవరిమీదో పడ్డాడు.

"యూ బ్రూట్!" అం దెవరో.

"పిలిచావా?" అంటూ వచ్చాడు, మూరుమూల మసక చీకట్లో మరెవ్వరితోనో సరసాలాడుతున్న ఆమె మొగుడు.

"యూ సిల్లీ!" అంటూ బుగ్గమీద ఓ గిల్లు గిల్లింది. "హాయ్!" అంటూ మరెవ్వణ్నో పలకరించింది. పాట పాకంలో పడింది.

ఆడవాళ్ళలా ఉన్న మగాళ్ళు, మగాళ్ళలా ఉన్న ఆడవాళ్ళు గెంతుతున్నారు.

పిచ్చెక్కిన రంగు రంగుల కోతులు తాగినట్లుంది.

చిన్నదాని మొలచుట్టూ మరో చిన్న గుడ్డపీలికే ఉంది.

ఈ లోకైనా తన కా గౌరవం దక్కాలి. తూలుతూ వెళ్ళాడు మత్తుమూర్తి చిన్నదాని దగ్గరకు.

"ఇది కూడా ఎందుకని?" ఉన్నది లాగాడు. ఆమె చేతిలో వంద రూపాయలు పెట్టాడు.

లైట్లు ఆరిపోయాయి!

చప్పట్లు చరిచారు.

లైట్లు వెలిగాయి!

వాటి చూసుకున్నాడు మత్తుమూర్తి.

క్లబ్ బయటి కొచ్చాడు.

బలవంతంగా గుర్తు పట్టాడు తన కారుని.

కారు కదిలింది.

నడుపుతున్నవాడిలాగానే కుడి ఎడమైతే పొరపాటేమన్నట్లు రోడ్డు కటూ ఇటూ నడుస్తూంది.

జంక్షన్ దగ్గర రిక్షా నిలబెట్టి బేరాలు లేక ఈగలు తోలుకుంటున్న రిక్షా రంగడు—

కారునడకని చూసి ఎందుకైనా మంచిదని సందులో మూసి ఉన్న కిళ్ళీ కొట్టు దగ్గర రిక్షాని నిలబెట్టాడు.

నెమ్మదిగానే వచ్చి, ఎలక్ట్రిక్ పోల్ని గుద్ది ఆగిపోయింది కారు.

స్టీరింగ్ దగ్గర మనిషి తల వేలాడేశాడు!

"అయ్య బాబోయ్!" రంగన్న పరుగెత్తాడు.

గుప్పున కొట్టింది కంపు.

'సుక్క ఎక్కువై పోనాది బాబుకి' అనుకున్నాడు.

"బాబూ!" అన్నాడు.

బాబు కళ్ళు తెరిచాడు.

"అయ్య బాబోయ్! సుజాతమ్మగారి మొగుడే!" పైకనేశాడు రంగన్న.

ఈ రోజుల్లో ఆడవాళ్ళనుబట్టి కొందరి మగాళ్ళకు గుర్తింపూ, గౌరవమూను! మత్తుమూర్తి కారు స్టార్ట్ చేశాడు.

'బుర్ ... బుర్ ... బుర్' అన్నది కదలలేకపోయింది.

"బాబుగారూ! నేను రిక్షాలో దింపనా!" అడిగాడు రంగన్న.

మత్తుమూర్తి ముద్దుముద్దగా మాట్లాడాడు. అసలే పెద్దవాళ్ళు తెలివిగా ఉన్నప్పుడే ఏం మాట్లాడతారో అర్థమై చావదు. తాగి మాట్లాడితే ఇక చెప్పక్కర్లేదు.

మళ్ళీ అడిగాడు రంగన్న.

ఏదో చెప్పబోయి సీట్లో వాలిపోయాడు మత్తుమూర్తి.

డోర్ తెరచి లేవదీయబోయాడు రంగన్న. అసలే పీపాలా ఉన్నాడు. మరో పీపాడు పట్టేసుంటాడు. ఒక్కడికీ ఓపలేదు. దారెపోయేవాణ్ణి బతిమలాడి రిక్షాలో కుదేశాడు రంగన్న మత్తుమూర్తిని.

రిక్షా మలుపు తిరుగుతూ పోతూంది. అక్కడినుంచే అప్. చెమటలు కక్కుతున్నాడు రంగన్న.

జీపుల్లో కూర్చుని సర్వే చేస్తే రోడ్లు అలాగే ఏడుస్తాయి. రిక్షామీదో, సైకిలు మీదో సర్వే చేస్తే పట్నం మధ్యలోనైనా ఇటువంటి ఎగుడుదిగుడు లుండవేమో? చెమటతో ఒళ్ళంతా స్నానం చేసినట్లుంది రంగన్నకు.

ఒక మేడ ముందు రిక్షా ఆపాడు. తలుపు కొట్టాడు.

తలుపు తెరిచిన అధునాతన యువతి కెవ్వుమంది.

ఎదురుగా ఎముకల గూడు.

చింకి గుడ్డలు.

చెమట కంపు.

"బాబుగారు ... రిచ్చా ... రిచ్చా ." రొప్పుతూ చెప్పాడు.

ఆమె రిక్షావైపు చూసింది.

"లోపలకు తీసుకు రా" అంది నిర్లక్ష్యంగా, తన కిది మామూలే అన్నట్టు.

"సాయం కావా లమ్మగారూ ..." గొణిగాడు రంగన్న.

"అయితే, నౌకర్ని లేపుతా" అంటూ విసుగ్గా వెళ్ళిపోయింది.

"అక్కర్లేదమ్మా. నే నున్నానుగా" అంటూ వచ్చిం దొక నెరిసిన తల.

"మీరు?" ప్రశ్నార్థకంగా చూశా డామె వైపు.

"ఈ ఇంటి నౌకర్నిమాత్రం కాను. అలా కనపడుతున్నానా? అంతా ఈ సుపుత్రుడి దయ. ఇదుగో నీ రెండు గ్గానీ, కాళ్ళు పట్టుకో" అందావిడ.

ఇద్దరూ సాయంపట్టి సోఫాలో పడుకోబెట్టారు.

మత్తుమూర్తి వంక ఓ నిమిషం చూసి కళ్ళ నీళ్ళు ఒత్తుకుంటూ వెళ్ళిపోయిం దా కన్నతల్లి.

బట్టలు మార్చుకుని వచ్చింది మత్తుమూర్తి భార్య. నైట్ గౌన్లో నిగనిగలాడుతూంది. కాని, ఆవిడ కవలు చాలా విసుగ్గా ఉంది.

---

పంచశీల

**ఒక పదవిని నిర్వహించడానికి మనిషికి అయిదు సుగుణాలు కావాలి. సమర్థత, నిజాయితీ, నిగ్రహం, ఓర్పు. నిష్పక్షపాతం... ఇవి లేనివాడు అధికారి అనిపించుకోడు.**

—శివ్

---

రాక్షస నామ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మహిళా సంవత్సరం'గా ప్రకటించిన సందర్భంలో ఆ ఊళ్ళో ఉన్న లేడీస్ క్లబ్ నిర్వహించిన సభలో పాల్గొని, 'ఆదర్శ మహిళ' గురించి తెగ వాగి వచ్చింది.

పాపం! తాగిన మొగుడూ ఇప్పుడే వచ్చాడాయె!

"కాస్త మజ్జిగట్టించేయండి" అన్నాడు బెరుగ్గా రంగన్న.

'మహా చెప్పొచ్చావు లేవోయ్' అన్నట్లు ఈసడింపుగా చూసిం దామె.

ఇంతలో మత్తుమూర్తి కళ్ళు తెరిచాడు.

తను సోఫాలో ఉన్నాడు.

గబుక్కున లేచాడు.

ఎదురుగా పెళ్ళాం. పక్కన రిక్షా రంగన్న. కొద్దిగా సిగ్గుపడ్డాడు.

అయినా, ప్రతి మొదటి తారీఖునా తన కిది మామూలే.

"సుజీ! వీడి మొహాన అర్ధరూపాయి పడేయ్" అన్నాడు అతి కష్టంమీద.

అర్ధరూపాయా? !

'పిప్పళ్ళ బస్తాలా ఉన్న నిన్ను రిక్షాలోకి ఎత్తినందుకు అయిదు, ఇంట్లోకి మోసినందుకు అయిదు ఇవ్వొచ్చు' అనుకున్నాడు మనసులోనే రంగన్న.

"చిల్లర లేదండి. ఒక రూపాయుంది" అంది సుజాత.

"బాబూ!" గొణిగాడు రంగన్న.

"చెప్పేదేదో సరిగ్గా చెప్పేడు." గదమాయించింది సుజాత.

"ఒక రూపాయున్నా ఇప్పించండి" అన్నాడు రంగన్న.

"రూపాయే! నీకు అంతుండాలిరా, ఫూల్. లేపొచ్చి అర్ధరూపాయి పట్టుకెళ్ళు ... చిల్లర లేదు...చిల్లర ..." అన్నాడు కరిచినట్టుగా, అంత మత్తులోనూ.

నిట్టూరుస్తూ, వట్టి చేతులతో మెట్లు దిగాడు రిక్షా రంగన్న.

* * *

"రత్తీ! నీ కెన్నిసార్లు చెప్పానే నే నొచ్చేదాకా కూచోవద్దని? రెండు మెతుకులు కొరికేసి ..." నాలిక కరుచుకున్నాడు రంగన్న.

ఈ పూట వండిందో, లేదో?

పొయ్యి వంక చూశాడు.

కట్టెలు కాలి ఉన్నాయి.

'హమ్మయ్య! వండే ఉంటుంది. ఎక్కడో బియ్యం అప్పు పట్టుకొచ్చిం దన్న మాట.'

గుమ్మం దగ్గర కునుకుతున్న రత్తి లేచి, "సరేగాని, నీ వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కురా" అంది.

రంగన్నకు వడ్డించి, తనూ వడ్డించుకుంది రత్తి.

ఆత్రంగా తింటున్న రంగన్న వంక జాలిగా, ప్రేమగా చూసింది రత్తి.

చీర చెంగుతో చెమట తుడుస్తూ, 'రెక్కలు ముక్కలు చేసుకొస్తున్నాడు, ఎలా సిక్కిపోయాడో! మొహం ఎలా పీక్కుపోయిందో ... పిచ్చి సన్నాసి' అనుకుంది రత్తి.

'వట్టి మడిసి కూడా కాదు. సగం అన్నమే తింటాది. నీవు తింటే సాల్నెంట్రా అంటాది.' తింటూ అనుకున్నాడు తనలో రంగన్న.

రత్తి నాలుగు మెతుకులు కొరికింది.

రంగన్న చాప వాల్చుకుంటుంటే, "ఉండు. రిచ్చా సీటు తెత్తా నాగు" అని వెళ్ళింది రత్తి బయటికి.

"ఓలమ్మో! ... ఓరి బాబోయ్! ..."

"ఏమైందే ... ఏటయింది ..." బయటికి పరుగెత్తాడు రంగన్న.

"ఇదెక్కడిదిరా, మావాఁ?" అని అడిగింది రత్తి, ఒక పర్సు పట్టుకొచ్చి.

"అయ్య బాబోయ్!" అని రత్తి చేతిలోని పర్సుని లాక్కుని చూశాడు రంగన్న.

విప్పి చూశాడు.

ఎన్ని వందల నోట్లు! విచ్చలవిడిగా పదులు, ఐదులు ... చిల్లర!

కళ్ళు జిగేల్మని కమ్మాయి రంగన్నకు.

ఈ దెబ్బతో దరిద్రం తీరిపోద్ది. కలిమొచ్చినా, కష్టమొచ్చినా చెప్పకుండా ఇలానే వస్తుంది కాబోలు. తండ్రిని కాదని తన్ను కట్టుకున్న రత్తికి త నేమిచ్చాడు? చింకి జాకెట్లు...అతి కష్టం మీద శరీరాన్ని కప్పుతున్న అతుకుల చీరలు.

ఈ సారి మంచి కంచి పట్టుచీర కొనిపెట్టేయాలి. పట్టే మనిషి కాదు కదా ... మంచి మంచి వంటలు తిప్పించాలి.

బోసి మెడలోకి ఏమైనా చేయించాలి.

వంచర్లవుతున్న మూడు ట్యూబుల్ని మార్చేయాలి. కొత్త టైర్లు వేయించాలి. గుడిసె వంక చూశాడు. చుక్కల్ని చూపుతున్న చిల్లులు. ఈ సారైనా తాటాకులు పీకేసి రేకులు వేయించాలి...

"లెక్క ఎక్కువటం టే సుక్కల్లోకి సూత్తా వేంటి?" గదమాయించింది రత్తి.

"ఎక్కడదైతే? ఎత్తుకురాలేదు."

"ఆ పని నూవు సేయవని నాకు తెల్సు. కానీ ... ఇది ... మరి ..." అను మానంగా ఉంది రత్తికి.

"అదా ... నే తోలిన కిరాయిల్లో ఎవరిదో తెలియదు. ఈయాల మొద టాటకు ఒక మొగుడూ, పెళ్ళాన్ని తోలాను...

అక్కడి నుంచి ఒక సెట్టు లాల్చీని, సుక్కల చీరని పార్కుకు తోలాను ...

మూడు కుటుంబాల్ని క్లబ్‌కు చేర్చాను ... మరి ... మరి మందెక్కు వయిన మారాజుని ఇంటికి సాయంపట్టా. అంతే ...

క్లబ్ కెళ్ళే వాళ్ళ పర్సయితే, లచ్మి, ఇవ్వకపోయినా ఫరవాలేదు.

సాయాల్ది దాని గూడ్డ ఊడదీసి వంటలొంట లిచ్చేత్తారు.

సింకిగుడ్డలోడు, బక్కసిక్కినోడు ఏదవ ఒక్క పైసియ్య బాబూ అంటే కసిరి కొట్టేత్తారు.

లచ్మీ! బుద్దు ఇత్తాడే క్లబ్‌లో ... ఆడే ... ఎవడాడు? బేరర్‌గాడు. ఆడికి పచ్చకాగితా లిచ్చి ఇహ చిల్లర అడగవే అడగరు.

రెక్కలు ముక్కలు సేసుకుంటున్న నాలాటోడు, పదిపైస లెక్కువ ఇవ్వం చండి బాబాయ్ అంటే — చిల్లరలేదని కసురుకుంటారు...

ఆడు తాగున్నాడు కదా అని ఇంటికి చేరిస్తే ఆడిచ్చే అర్ధరూపాయి కూడా ఆసకొచ్చి పట్టుకెళ్ళమన్నాడే ... అదీ డబ్బున్నోళ్ళ యవహారం ... తెల్సా?"

"అదికాదు, మావాఁ! డబ్బున్న వాళ్ళకు లేనిదీ, మనకున్నదీ ఒక్కటే ... అదే నిజాయితీ.

అది లేనప్పుడు ఆళ్ళకి, మనకు తేడా లేదు."

"కాదే, లచ్మి! ఈ డబ్బుతో ..."

"నన్ను మారాణిని చేసేద్దామనుకుం టున్నావా? వద్దు మావాఁ, మనకున్న దానితో కలో గంజో తాగుదాం. ఒకళ్ళ దని తెలిసి కూడా ఆ డబ్బు ఉంచుకోవడం దొంగతనమే అవుతుంది. అటువం టప్పుడు సర్విగాడికీ, మనకూ తేడా లేదు."

"ఆడికేమే! బయటి కొచ్చినప్పుడు మారాజులా ఉంటాడు."

"తర్వాత ఆర్నెల్లు జైల్లోనే సత్తా డుగా — దొంగ సచ్చినోడు! ఆడి ఊసెత్తకు. ఆడి మొహాన అందరూ ఎలా ఉమ్మేత్తారో.

ఈ రిచ్చా రంగన్న నిజాయితీపరుడని నలుగురూ అనుకోవాలి. నా కదే పదేలు" అంది రత్తి.

"అయితే, నేనిప్పు డేం చేయను?"

"పోలీసు స్టేషను కెళ్ళి ఇచ్చేయి. పాపం! పోయినోళ్ళు ఎంత ఇదై పో తున్నారో? ఎల్లు ... ఎల్లు" అంది.

* * *

"సార్! ఏడి రిక్షాలో ఎవరో పర్సు వదిలేశారట, సార్!" టు హెడ్ త్రీ.

"బాబోయ్! పర్సే? ఎంతుందో, ఏమిటో?" పరుగెత్తు కొచ్చాడు హెడ్ కానిస్టేబుల్.

పర్సు విప్పి చూశాడు ఇన్‌స్పెక్టర్ కిశోర్. విచ్చలవిడిగా పేర్చబడిన పచ్చ నోట్లు ... పదులు ... ఐదులు!

విజిటింగ్ కార్డుంది.

నంబరు చూసి, రింగ్ చేశాడు కిశోర్.

"డర్టీ ఫెలోస్! విజిటకూడా పోని వ్వరు." విసుక్కుంది ముత్తుమూర్తి భార్య.


రిసీవరెత్తి, "హలో! మిసెస్ మూర్తి హియర్. పోలీసు స్టేషనా ... పర్సు ... మూర్తిగారిదా? జస్ట్ ఐయాం పెండింగ్ హిమ్... ప్లీజ్ కీపిట్" అని ఫోను పెట్టి, మొగుణ్ణి లాగి ఒకటిచ్చుకుంది.

ముత్తుమూర్తికి మత్తు వదిలి పోయింది.

"మీ పర్సేది?" అంది.

"జేబులో."

"జేబులోనా? జేబులో లేదు కానీ, పోలీసు స్టేషన్లో ఉందట, ఫోన్ వచ్చింది."

కళ్ళజోడు లేకుండ మీరు కంటి చూపు పొందగలరు!



మీకు ఇంతకన్న ఎక్కువ ఆనందాన్నిచ్చేవార్త మరొకటి ఉంటుందా!

'కాంటాక్ట్ లెన్స్'లను వాడండి

ఈ 'కాంటాక్ట్ లెన్స్'లు హ్రస్వదృష్టి, దూరదృష్టి మరియు అఫాకి (కాటరాక్టు ఆపరేషను పిమ్మట), కెరాటోకోనస్, అనిసోమెట్రోపియా, అనిసికోనియా, ఫోటోఫోబియా మొదలైన దృష్టిదోషములు కలవారికి ఉత్తమమైనవి.

'కాంటాక్ట్ లెన్స్'లను మీ కంటి పాపలకు మీకుమీరే అనుకూలంగా పెట్టుకొనవచ్చును... తీసివేసికొనవచ్చును - కొద్దిదినముల అభ్యాసంతో, మీ కళ్లకు పెట్టుకొన్న చిన్న 'కాంటాక్ట్ లెన్స్'లు ఇతరులకు అగుపించవు. కనుక మీ సుందర ముఖంలో ఎట్టిమార్పును వుండదు.

మీ కంటి వైద్యుని సంప్రదించండి

ఇతర వివరములకు : ఆసియా కాంటాక్ట్ లెన్స్ లేబొరెటరీ
4/1, అండర్సన్ రోడ్,
మద్రాసు-600 006

ఫోన్: 87865

పోలీసు స్టేషను ముందు చిన్న కారు ఆగింది. (మరి బాబుగారికి బాగాపోయించి పెద్దకారు రోడ్డుమీద నిద్రపో తూందిగా!)

మెల్లిగా నడిచి వచ్చి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు సత్యమూర్తి, నిలు చుంటే పడిపోతా నన్నట్టుగా.

"చాలా థాంక్స్ ... పర్సు దొరికించినని చాలా థాంక్స్ ... రాత్రి క్లబ్ కెళ్ళాను."

'అబ్బాయిగారు ఆ సంగతి చెప్పక్క ర్లేదు. ఉబ్బిన కనురెప్పలు, చింతనిప్పుల్లా ఉన్న కళ్ళు చెపుతూనే ఉన్నాయి. ఇంకా హేంగోవరు ఉన్నట్టుంది గురుడికి' అను కున్నాడు ఇన్‌స్పెక్టర్ కిశోర్.

మళ్ళీ సత్యమూర్తే అందుకున్నాడు. "రాత్రి క్లబ్ కెళ్ళాను. ఎప్పుడంటే పోయుంటుంది" అని అతి కష్టంగా పూర్తిచేశాడు సత్యమూర్తి.

"పర్సులో ఎంతుంటుంది?"

"సుమారు రెండు వేలు."

"చూడండి. ఈ పర్సు మీదేనా?"

"ఎస్. ఇటీజ్ మైన్ ... ఇటీజ్ మైన్. థాంక్స్ లాట్" అని పర్సందుకుని గబగబా నోట్లు లెక్కపెడుతున్నాడు.

ఇంతేనా అన్నట్టు, ఎంత ఖర్చు పెట్టానా అన్నట్టు మొహం పెట్టాడు.

"ఏమైనా తక్కువైందాండీ? కూర్చుని లెక్క పెట్టుకోండి. పాపం, రాత్రి క్లబ్‌కి కూడా వెళ్ళారాయె! సరిగ్గా గుర్తుచేసుకోండి."

ఎర్రగా ఉన్న కళ్ళు మరింత ఎర్ర బడ్డాయి.

"మిస్టర్ ఇన్‌స్పెక్టర్! యు నో విత్ హూమ్ యు ఆర్ స్పీకింగ్."

"ఎస్. ఐ నో. అయాం స్పీకింగ్ విత్ ఎ క్లబ్‌మేట్ ఆఫ్ మై డి. ఎస్. పి."

"ఎస్. నోటెడ్" అని విసురుగా వెళ్ళిపోతున్న సత్యమూర్తి మసక చీకట్లో స్తంభానికి ఆనుకుని కునికి పాట్లు పడుతున్న రంగన్నని చూశాడు.

"ఓహో, నువ్వా! ఇక్కడ!" రంగన్న లేచి నిలుచున్నాడు.

"వీడు తెచ్చి ఇచ్చాడా?"


హెడ్ తల ఊపాడు.

"రిక్షా వెధవ తెచ్చి ఇచ్చాడు కాబట్టే మిమ్మల్ని సరిగ్గా లెక్కపెట్టుకో మంటున్నాను.

ఏమైనా తక్కువైతే ఇక్కడే చెప్పండి, తెచ్చిన ఈ తెలివి తక్కువ వెధవని ముక్కలేసేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆ మాటలు వినసట్టుగా — "ఏమోయ్, చిల్లరుందా?" అన్నాడు సత్యమూర్తి.

"లేదండి, బాబాయ్!"



మద్రాసులోని సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' సేవను అభినందిస్తూ సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి. ముద్దుకృష్ణారెడ్డిగారికి మెమెంటోను విద్యా మంత్రి శ్రీ ఎమ్. ఏ. కృష్ణారావుగారు అందిస్తున్న దృశ్యం. పక్కన ఉపాధ్యక్షులు శ్రీ టి. వి. కె. శాస్త్రి, కార్యదర్శి శ్రీ సుభాష్ ఉన్నారు

"పందరూపాయల్దా, సార్? సాతి కుంటుందేమో?" అన్నాడు హెడ్.

"కాదు. రూపాయిది."

"ఉంది, సార్!"

హెడ్ దగ్గర చిల్లర తీసుకుని, "ఇదిగోనోయ్. ఉంచు" అని అర్ధ రూపాయి గిరాటేసి నిర్లక్ష్యంగా కారు స్టార్టుచేసుకుని వెళ్ళిపోయాడు సత్య మూర్తి. ఆ అర్ధరూపాయిని కళ్ళ కద్దుకుని జేబులో వేసుకున్నాడు రంగన్న.

"ఇలా రా!" పిలిచాడు ఇన్‌స్పెక్టర్.

నెమ్మదిగా వచ్చాడు రంగన్న.

"కూర్చో."

తటపటాయించాడు.

"కూర్చో, రంగన్నా, ఫరవాలేదు" అని బలవంతంగా కూర్చోబెట్టాడు రంగన్నని కిశోర్.

"ఎంతిచ్చాడో చూశావా నీ కాయన? పాపం, కష్టపడి పర్సు తెచ్చావుగా!"

"పర్సు తెచ్చినందు కు కాదు, బాబూ! రాత్రి కిరాయి డబ్బులు నా కాయన బాకీ. ఆయన రాత్రి కార్లో వస్తున్నాడు. పాపం, సుక్కెక్కువ య్యింటుంది బుల్లో డికి కారు తోలలేక కళ్ళు తేలేస్తే రిక్షాలో రాత్రి ఇంటికి దింపేశా."

"ఓహో! అర్ధరూపాయి అందు కిచ్చా డన్న మాట. మరి ముందెందుకు నాకు నీవు చెప్పలేదు. మంచి బేరమే!" వెట కారంగా అన్నాడు కిశోర్.

ఆప్యాయత కళ్ళలో చిప్పిల్లుతుండగా, "రంగన్నా! టీ తాగుతావా? పాపం, రాత్రంతా నిద్రలేనట్టుంది" అని రంగన్న మాట కెదురుచూడకుండా టు వాన్ త్రీని రెండు టీలు పట్టుకు రమ్మన్నాడు.

"రంగన్నా! అందరూ నీలాంటి మంచి వాళ్ళయితే మా లాంటి వాళ్ళ కపలు పనుండదనుకో!"

"బాబూ! ఇతరుల్లో మంచి చూడా లంటే మనలో కూడా కాస్తో కూస్తో మంచనేది ఉండాలి. ఏమంటావు, బాబూ?"

ఎంత అర్థవంతంగా మాట్లాడాడు!

టీలు వచ్చాయి.

"తీసుకో టీ ... విన్నే...తీసుకో మంటూంటే."

రంగన్న సిగ్గుపడుతూ టీ తాగు తున్నాడు.

"రంగన్నా! నీ పూర్తిపేరు? ఇక్కడ ఎన్నాళ్ళనుంచి రిక్షా లాగుతున్నావు?"

"నన్ను సింతా రంగన్న అంటారండి. పదేళ్ళనుంచి రిచ్చా లాగుతున్నానండి. ఏం బాబూ! ఇవరాలు అడుగుతున్నారు? రాతకోతల్లో న న్నిరికించకండి— రెక్కాడితే గాని డొక్కాడదు."

"ఛీ ఛీ! నిన్నెందుకు ఇరికిస్తా? నీ పేరు పేపర్లో వేద్దామని."

"నా పేరు పేపర్లోనే!"

"ఏం, నీ పేరు పేపర్లో పడ కూడదా? మన నాయకులు మీటిం గుల్లో చొక్కాలు, బనియన్లు చింపు కున్నా, తుమ్మినా, దగ్గినా పేపర్లో ఫోటోలతో సహా పడుతుంటే ఇంత మంచిపని చేసిన నీ పేరు పేపర్లో ఎందుకు పడదు?"

రంగన్నకు మతి పోతూంది.

పోలీసోళ్ళు అంత ప్రేమగా మాట్లా డటం ప్రమాదమే మరి!

రంగన్న అనుమానంగా చూశాడు కిశోర్ వైపు. కిశోర్ మొహంలో కపటం కనపడలేదు.

'నా జన్మ కిది సాలు. ఇన్‌స్పెక్టరు బాబు కుర్చీలో కూకోబెట్టాడు. టీ ఇప్పిం చాడు. పేపర్లో ఏయిస్తాడట పేరు. అదే గనక ఆ పర్సు తమంచేసుకుంటే అవతలోడు రిపోర్టిస్తే ఈ పాటికి కొట్లో పెట్టి కుళ్ళబొడుద్దురు.'

రంగన్న మనసు మంచికున్న విలువ అంచనా వేస్తూంది.

"రంగన్నా!"

"సెప్పండి, బాబూ!"

"ఇంద. ఈ అయిదు రూపాయలు ఉంచు. ఈ పేద ఇన్‌స్పెక్టర్ ఇంత కంటే ఎక్కువ బహుమతి ఇవ్వలేడు. తెల్లవార్లూ స్టేషన్లోనే సరిపోయింది జాగారం నీకు. బేరాలు కూడా లేవు" అని బలవంతంగా జేబులో కుక్కబోయాడు కిశోర్.

"బాబూ!" రెండు చేతులు జోడిం చాడు రంగన్న.

"మీ మాటలు సాలు, బాబూ! ఈ డబ్బు నే నట్టకెల్తే, నీ నిజాయితీకి ఇలవ కట్టుకొచ్చావా అని ఇంటిది కూడు కూడా పెట్టదు. నీకు తెలవదు, బాబూ. తక్కువ కులంలో పుట్టినా, సాలా నిక్కచ్చైయిన మడిసి బాబూ, నా ఆడది. నాకోసం ఎదురుసూత్తూ ఉంటాది. తెల్లారింది కూడా. వత్తాను, బాబూ" అని కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపో తున్నాడు రంగన్న.

కొత్త ఇన్‌స్పెక్టరు కది సరికొత్త అనుభవం!

'ప్రతి మహాత్ముని వెనకే కాకుండా ప్రతి నిజాయితీపరుని వెనక కూడా ఆడది ఉందన్న మాట' అనుకున్నాడు ఇన్‌స్పెక్టర్ కిశోర్! ★